నాణ్యమైన జీడిపప్పును కొనుగోలు చేయాలి : జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

విశాలాంధ్ర - పార్వతీపురం : వన్ ధన్ వికాస్ కేంద్రాల (వీడీవీకె) సభ్యులు జిల్లాలో నెలకొల్పే జీడి పరిశ్రమలకు నాణ్యమైన జీడిపప్పును రైతుల నుంచి కొనుగోలు చేసుకునేలా సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులకు సూచించారు. పరిశ్రమల స్థాపనకు అవసరమయ్యే జీడి పప్పును ముందుగా సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ ఏడాది 300 మెట్రిక్ టన్నుల జీడి పప్పు వీడీవీకెల లక్ష్యం కావాలని కలెక్టర్ అధికారులకు దిశా నిర్దేశం చేసారు. స్వయంగా జీడి పరిశ్రమలను ఏర్పాటు చేసుకొని క్రయ, విక్రయాలు జరుపుకునేలా వీడీవీకెల సభ్యుల తీర్మానం తప్పనిసరి అని కలెక్టర్ గుర్తుచేశారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సబ్ కలెక్టర్లు, ఎపిఎంలు, ఉద్యానవన శాఖ అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారవేత్తలు రైతుల నుంచి నాణ్యమైన జీడిపప్పును ముందుగా కొనుగోలు చేసే అవకాశం ఉన్నందున, దాన్ని దృష్టిలో ఉంచుకొని ముందుగానే వీడీవీకె సభ్యులు కొనుగోలు చేసుకునేలా చూడాలన్నారు. కొనుగోలు చేసిన పప్పును ప్రాసెసింగ్ చేసి విక్రయాలు జరిపే వరకు అవసరమయ్యే గన్నీ బ్యాగులు, స్టోరేజ్ పాయింట్లను సిద్ధం చేయాలని తెలిపారు. అదేవిధంగా జీడి పరిశ్రమ లకు అవసరమైన యంత్ర సామాగ్రి, ప్రాసెసింగ్, క్రయ విక్రయాలు, బ్రాండింగ్, ప్యాకింగ్, రవాణా, మార్కెటింగ్ సదుపాయాలపై సభ్యులకు పూర్తిగా అవగాహన కల్పించి, శిక్షణ ఇప్పించాలని సూచించారు. ఏప్రిల్ 15 నాటికి ఈ ప్రక్రియ పూర్తికావాలని తేల్చి చెప్పారు. క్రయ విక్రయాలు, స్టోరేజ్ తదితర వాటికి చెందిన రికార్డులు పక్కాగా నిర్వహించుకునేలా ఇద్దరు వీడీవీకె సభ్యులకు పూర్తి అవగాహన ఉండాలని అన్నారు. అలాగే క్రయ, విక్రయాలు జరిపే సమయంలో సాధారణ, గ్రేడ్- ఎ రకాల ధరలను తెలియజేసే పట్టికను అందరికి కనిపించేలా బోర్డులను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి కేంద్రంలో సిసి కెమెరాలు తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వీడివికేలు పరిశ్రమలు నెలకొల్పుకునేందుకు అవసరమయ్యే బ్యాంకు ఖాతా, జీఎస్టీ, లైసెన్స్, విద్యుత్, నీటి సదుపాయాలు, వెంటిలేషన్, రాను పోను మార్గాలు, ఇతర ప్రాసెసింగ్ తదితర చర్యలు తీసుకోవాలన్నారు. నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం అన్నీ సకాలంలో జరగాలని, ఆ దిశగా అధికారులు చొరవ తీసుకోవాలని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో పార్వతీపురం, పాలకొండ ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారులు అశుతోష్ శ్రీవాస్తవ, సి. యశ్వంత్ కుమార్ రెడ్డి, వెలుగు ప్రాజెక్ట్ అధికారి వై. సత్యం నాయుడు, ఎపిఎంలు, ఉద్యానవన శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు ఎమ్మెల్సీ విక్రాంత్ విజ్ఞప్తి

విశాలాంధ్ర - పాలకొండ : పాలకొండ నగర పంచాయతీ డంపింగ్ యార్డ్ సమస్యపై ఏపీ మున్సిపల్ శాఖ మినిస్టర్ పి నారాయణకు గురువారం ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ కలసి డంపింగ్ యార్డ్ సమస్యను వివరించారు పాలకొండ డంపింగ్ యార్డ్ కి సంబంధించి న్యాయపరమైన అంశాలను తొలగించి, శాశ్వత పరిష్కారం చేసి పాలకొండ ప్రాంత ప్రజలకు మేలు జరిగే విధంగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు అందుకు మున్సిపల్ మినిస్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

పోషణ భీ..పడాయి భీ పై శిక్షణ

విశాలాంధ్ర - కురుపాం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టంగా అమలు కు శ్రీ కారం చుట్టిన పోషణ భీ-పడాయి భీపై శిక్షణ అంగన్వాడీ కార్యకర్తలు కు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రాజెక్ట్ అధికారిణి కె.విజయగౌరి గురువారం ప్రారంభించారు. ఈ శిక్షణ మార్చి20 నుంచి 22 వరకు జరుగు తుందని తెలిపారు. అనంతరం కార్య క్రమంలో ముఖ్యా ంశాలు వివరించారు. ఐసిడిఎస్ ద్వారా వివిధ పథకాల రూపంలో అందిస్తున్న పోషణ, బాలికల విద్య పై అవగాహన కల్పించారు. బాలికా ఆరోగ్యం, తీసుకో వలసిన జాగ్రత్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్స్ భవాని, జానకి, గౌరి, శ్రావణి భాగ్య లక్ష్మి చక్రధర్, శ్రీనివాస్ మరియు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నలుగురికి జరిమానా

విశాలాంధ్ర - పాచిపెంట : పాచిపెంట పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన నలుగురు వ్యక్తులకు గౌరవ జె .ఎఫ్. సి ఎం. (సాలూరు) వి. కనక లక్ష్మి ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున ఈరోజు జరిమాన విధించినట్లు పాచిపెంట ఎస్సై కే .వెంకట సురేష విలేకరులకు తెలిపారు. రెండవ సారి దొరికిన యడల 3 నెలలు జైలు శిక్ష విధించబడుతుంది అని గౌరవ న్యాయమూర్తి హెచ్చరించినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనాలు నడిపేవారు మద్యం సేవించి నడిపితే జరిమానా తో పాటు జైలు శిక్ష పడుతుందని అన్నారు.

జిల్లా పరిషత్ చైర్మన్ చిన్న శ్రీనుకు పరామర్శ

విశాలాంధ్ర - పాలకొండ : ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను అన్నయ్య) రెండవ కుమారుడు, పుత్ర వియోగం కలిగింది, విషయం తెలుసుకున్న పాలకొండ నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ శాసన సభ్యురాలు విశ్వాసరాయి కళావతి గురువారం విజయనగరంలో చిన్న శ్రీను అన్నయ్య స్వగృహంలో పరామర్శించారు ముందుగా స్వర్గీయ ప్రణీత్ బాబు చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ప్రణీత్ బాబు మరణం చాలా బాధ కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా శ్రీను అన్న కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని, తెలిపారు. కళావతితో పాటు పాలకొండ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఐదవ వార్డు కౌన్సిలర్ వెలమల మన్మధ రావుతో పాటు కౌన్సిలర్స్ తుమ్మగుంట అనూష అయ్యప్ప శంకర్, కడగల అనూరాధా వెంకటరమణ, కోడెం సాయికృష్ణ విజయ్ కుమార్(బాబి)భాసూరు కాంతారావు, దుంపల రమేష్ బాబు(చిన్ని) తదితరులు ఉన్నారు.

నోటి ఆరోగ్య సూత్రాలను పాటించాలి

విశాలాంధ్ర - బెలగాం : మంచి నోటి పరిశుభ్రత పద్ధతులను నిర్వహించడం, క్రమం తప్పకుండా దంత సంరక్షణ పొందడం యొక్క ప్రాము ఖ్యతను ఈ రోజు గుర్తు చేస్తుందని పార్వతీపురం జిల్లా ఆసుపత్రి దంత వైద్యులు డా. సౌజన్య తెలిపారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా ఆసుపత్రి డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్ వెన్షన్ సెంటర్లో (డిఈఐసి) మార్చి 20వ తేదీన జరుపుకునే ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సంతోషకరమైన నోరు సంతోషకరమైన శరీరం ఆరోగ్యకరమైన నోటిని నిర్వహించడానికి అవసరమైన జ్ఞానం మరియు సాధనాలను అందించడం ద్వారా తమ నోటి ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. నోటి సమస్యలపై సరైన సంరక్షణ మరియు నివారణలో దంత వైద్యునితో క్రమం తప్పకుండా దంత పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. క్రమం తప్పకుండా బ్రష్ చేయడం మరియు ఫ్లాసింగ్ చేయడం వంటి మంచి నోటి పరిశుభ్రత పద్ధతులు, కావిటీస్, చిగుళ్ల వ్యాధి మరియు దుర్వాసన వంటి సాధారణ దంత సమస్యలను నివారించడంలో సహాయపడతాయని, నోటి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో చిన్న పిల్లల వైద్య నిపుణులు భరత్ చంద్ర, మెడికల్ ఆఫీసర్ లలిత, ఫిజియో తెరపిస్టు డా. ఎద్దు లక్ష్మినారాయణ, వైద్య సిబ్బంది, ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తలకు మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు

విశాలాంధ్ర - గుమ్మలక్ష్మీపురం : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఎస్ సాల్మన్ రాజు ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలకు మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో తెలిపారు, ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పౌష్టికాహారము, ప్రీ స్కూల్‌లో అందిస్తున్న విద్యా విధానంపై శిక్షణ తరగతులు నిర్వహించడం వల్ల చిన్నారులకు చక్కటి విద్యను అందించేందుకు దోహద పడతాయని ఆయన అన్నారు, అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులు చక్కటి విద్యను అభ్య సించేందుకు తగిన వసతులను ప్రభుత్వం కల్పిస్తున్నందున అంగన్వాడి కార్యకర్తలు వీటిని అవగాహన చేసుకుని చక్కటి వాతావరణం లో చిన్నారులకు విద్యను అందించాలని ధ్యేయంతో ప్రభుత్వము పనిచేస్తుందని ఆయన తెలిపారు. ఆటపాటలతో పాటుగా పౌష్టికమైన ఆహారం అందించినట్లయితే చిన్నారులు అంగన్వాడి కేంద్రాల్లోనే ఎక్కువ సమయం గడిపేందుకు మొగ్గు చూపుతారని ఆయన అన్నారు, ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఓ రాజ్యలక్ష్మి, సూపర్వైజర్లు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో ప్రవేశాల కోసం ఆన్ లైన్ దరఖాస్తులు స్వీకరణ

విశాలాంధ్ర - కొమరాడ : సమగ్ర శిక్షా ఎస్పీడీ శ్రీ బి.శ్రీనివాసరావు ఆదేశాల ప్రకారం రాష్ట్రంలోని 352 కేజీబీవీల్లో 2025 - 26 విద్యా సంవత్సరానికి గానూ 6,11 తరగతుల్లో ప్రవేశాల కోసం, 7, 8, 9, 10, 12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం బాలికల నుండి ఆన్ లైన్ దరఖాస్తులు స్వీకరించబడతాయని ఈనెల 22 నుండి ఏప్రిల్ 11 వరకు అందుబాటులో ఉంటాయని అన్నారు. అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్ (బడి మానేసిన వారు) పేద, ఎస్.సి, ఎస్.టి, బిసి, మైనారిటీ, బి.పి. ఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులు మాత్రమే అడ్మిషన్ కొరకు పరిగణింపబడతాయని తెలిపారు. ఈ దరఖాస్తు https://apkgbv.apcfss.in సైట్ ద్వారా పొందగలరు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుంది. సంబంధిత పాఠశాల నోటిఫికేషన్ బోర్డులో నేరుగా చూడవచ్చు. ఏవైనా సమస్యలు, సందేహాలకు 7075159996 7075039990 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

అగ్నివీర్‌లో ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం

జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి సోమేశ్వరరావు

విశాలాంధ్ర - పార్వతీపురం : భారత సైన్యంలో అగ్నివీర్ ఉద్యోగాలకు ఆన్ లైన్ ద్వారా అభ్యర్థుల ధరఖాస్తులు చేసుకోవాలని జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి ఎ. సోమేశ్వరరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారత సైన్యంలో అగ్నివీర్ ఉద్యోగాలకు అవివాహిత పురుష అభ్యర్థుల నుండి ఆన్ లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. ఈనెల 12వ తేదీ నుండి ఏప్రిల్ 10 వరకు %www.joinindianarmy.nic.in వెబ్ సైట్ నందు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఆన్ లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు వారి అడ్మిట్ కార్డును డౌన్లోడ్ చేసుకోవడం ద్వారా ఆర్మీ ర్యాలీ తేదీ, సమయం పొందగలరని అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా యువత ఆన్ లైన్ పరీక్ష పాసైన వారికి ఆర్మీ ర్యాలీ (ఫిజికల్ ఫిట్నెస్ టెస్ట్) నిర్వహించడం జరుగుతుందన్నారు. అగ్ని వీర్ లో జనరల్ ఉద్యోగానికి 10వ తరగతి పాసై కనీసం 45 శాతం మార్కులతో ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. అగ్నివీర్ టెక్నికల్ ఉద్యోగానికి ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతతో పాటు ప్రతీ సబ్జక్టులో కనీసం 40 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిఉండాలని, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్, ఇంగ్లీష్ సబ్జ క్టులతో కనీసం 50 శాతం మార్కులు ఉండాలని పేర్కొ న్నారు. అగ్ని వీర్ క్లర్క్, స్టోర్ కీపర్ ఉద్యోగానికి ఇంటర్మీడియట్‌లో టెక్నికల్ ఆర్ట్స్, కామర్స్, సైన్స్ సబ్జక్టులతో కనీసం 60 శాతం మార్కులు, ప్రతీ సబ్జక్టులో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. అగ్ని వీర్ ట్రేడ్స్ మెన్ ఉద్యోగాలకు 8వతరగతి, 10వ తరగతి పాసై ఉండాలని అన్నారు. అభ్యర్థులు అక్టోబర్ 2004 నుండి ఏప్రిల్ 2008 మధ్య జన్మించి ఉండాలన్నారు.

శరీర కొలతలు : ఎత్తు : అగ్ని వీర్ జనరల్ డ్యూటీ, ట్రేడ్స్ మెన్ అభ్యర్థులు 166 సెం.మీ. ఎత్తు కలిగివుండాలని, అగ్నివీర్ టెక్నికల్ అభ్యర్థులు 165 సెం.మీ. ఎత్తు కలిగివుండాలని, అగ్నివీర్ క్లర్క్ స్టోర్ కీపర్ ,టెక్నికల్ అభ్యర్థులు 162 సెం.మీ. ఎత్తు ఉండాలని సూచించారు. ఛాతి 77 సెం.మీ, ఊపిరి పీల్చినప్పుడు 5 సెం.మీ. విస్తీర్ణం పెరగాలన్నారు. ఎత్తుకు తగిన బరువు కలిగి ఉండాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నాలుగు సంవత్సరాల షార్ట్ టర్మ్ సర్వీస్ ద్వారా అగ్నివీర్ ఉద్యోగానికి తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఆర్మీ రిక్రూట్ మెంట్ ఎంపిక పూర్తిగా పారదర్శకంగా ఆర్మీ ఆధ్వర్యంలో జరుగుతుందని, అభ్యర్థులు మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని కోరారు. ఆసక్తి గల పార్వతీపురం మన్యం జిల్లా యువ అభ్యర్థులు ఇండియన్ ఆర్మీలో చేరుటకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు కార్యాలయపు పని వేళలో సెట్విజ్ మేనేజరు కాగాన వెంకటరమణ, ఫోన్ నెంబర్ 9849913080కు సంప్రదించవచ్చని అన్నారు.

ఆధునిక యుగములోనూ గిరిజనులకు కలుషిత నీరే గతి

జల్ జీవన్ మిషన్ ద్వారా మంచినీరు అందించాలి

విశాలాంధ్ర - కొయ్యూరు : తరాలు మారుతున్న తమ తలరాతలు మాత్రం మారడం లేదని ఆదివాసి గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. స్వతంత్ర సిద్ధించి 78 ఏళ్లు గడచిన కొయ్యూరు మండలం మటం భీమవరం పంచాయతీ పరిధిలో గల చీడికోట గ్రామానికి మంచినీటి సౌకర్యం కల్పించడంలో ప్రభుత్వాలు, పాలకులు అధికారులు విఫలమయ్యాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రతి మారుమూల గ్రామానికి జల్ జీవన్ మిషన్ ద్వారా మంచినీటి సౌకర్యం కల్పించాలని సదుద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టిన ఈ ప్రాంతంలో మాత్రం అమలు కావడం లేదన్నారు. దీంతో కొండ కోనల్లో ప్రవ హించే ఊటనీరును గిరిజనులు సేవించి అనేక అనారోగ్యాలకు గురవుతూ ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు కూడా కొక్కోల్లలగా జరుగు తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ప్రభుత్వాలు పాలకులు అధికారులు మాత్రం గిరిజ నులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఊక దంపుడు ప్రసంగాలు గుప్పిస్తారు కానీ తామంతా ఇలాంటి కలుషిత నీరును సేవించడం వలన ఎలా ఆరోగ్య వంతంగా ఉంటామని ప్రశ్ని స్తు న్నారు. ఈ ప్రాంతం నుండి ఎన్నికవుతున్న ఎమ్మె ల్యేలు పార్లమెంటు సభ్యులు తమలాంటి మారు మూల గ్రామాల గురించి కనీసం కన్నెత్తి కూడా చూడడం లేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందించి చీడికోటతో పాటు అనేక మారుమూల గ్రామాలకు మంచి నీటి సౌకర్యం కల్పించి ఆదివాసి గిరిజనుల ప్రాణాలు కాపాడాలని కోరు తున్నారు. లేకుంటే మండల కార్యాలయం వద్ద చిన్న పెద్ద అనే తార తమ్యం లేకుండా గ్రామస్తులు అంత శాంతి యు తంగా సమస్య పరిష్కరించే తవరకు ఆందో ళన చేపట్టేందుకు సిద్ధమవు తామని హెచ్చరించారు.

హెచ్ఎం సొంత నిధులతో పాఠశాలకు ఇనుప కంచె ఏర్పాటు

'మామిడి మహేష్'ను అభినందించిన గ్రామస్తులు

విశాలాంధ్ర - కొయ్యూరు : ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు పాఠ శాలకు వెళ్ళామా విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పమా అని బేరేజ్ వేసుకుంటున్న ఈరోజుల్లో కొత్తపాడి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మామిడి మహేష్ పాఠశాల ప్రాంగణం చుట్టూ ఇనుపకంచును తన సొంత నిధులతో ఏర్పాటు చేయించి పలువురికి ఆదర్శంగా నిలి చారు. కొయ్యూరు మండలంకొండగోకిరి పంచాయితీ పరిధిలోగల కొత్త పాడి గ్రామంలో ఉన్న పాఠశాలకు ఎటువంటి రక్షణ కూడా లేకపోవడంతో విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదని తన సొంత నిధులతో పాఠశాల ప్రాంగణం చుట్టూ ఇనుపకంచెను ఏర్పాటు చేయించారు. దీంతో పాఠశాలలో ఉన్న మొక్కలకు రక్షణతో పాటు విద్యార్థుల ఆటలాడుకుంటున్న సమయంలో ఎటువంటి అపాయం కలగకుండా ఉంటుందని పలువురు అభినందిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలను తన సొంత ఆస్తిగా భావించి తన సొంత నిధులతో పాఠశాల ప్రాంగణం చుట్టూ ఇనుపకంచి ఏర్పాటు చేయించిన ప్రధానోపాధ్యాయులు మహేష్ ను సర్పంచ్ రేగటి ముసలి నాయుడు, విద్య కమిటీ చైర్మన్ వి.మల్లేశ్వరరావు గ్రామస్తులు పలువురు అభినందనలతో ముంచేత్తుతున్నారు.

ప్రకృతి సహజ సిద్ధ సేంద్రీయ ఉత్పత్తుల వాడకం ఆరోగ్యదాయకం



విశాలాంధ్ర - చింతపల్లి : ప్రకృతి సహజ సిద్ధ, సేంద్రియ ఎరువులతో సాగైన ఉత్పత్తులను తీసుకోవడం ద్వారా ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండేందుకు దోహద పడుతుందని స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత అన్నారు. ఏపీసీఎన్ఎఫ్, ఆర్వైఎస్ఎస్ సంస్థలో పనిచేస్తున్న చింతపల్లి డివిజన్ లో వివిధ హోదాలలో పనిచేస్తున్న సిబ్బంది తమ సొంత పంట పొలాలలో ప్రకృతి సేద్యం ద్వారా పండించిన పంటలను మరింత ఉత్పత్తి చేసేందుకు వారపు సంచలలో మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు, వ్యవసాయ శాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ పంటల ఉత్పత్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతమున్న వాతావరణ మార్పులలో ప్రకృతి వ్యవసాయం చాలా అవసరం అన్నారు. భావితరాల ఆరోగ్యానికై సేంద్రియ ఉత్పత్తుల వాడకం తప్పనిసరి అన్నారు. గిరి రైతులందరిని ప్రకృతి వ్యవసాయం వైపు మారే దిశగా కార్యచరణ చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనూష దేవి, ఎంపీడీవో శ్రీనివాస రావు, వ్యవసాయ అధికారి మధుసూదన్, ఏపీసీఎన్ఎఫ్ డివిజన్ ఇంచార్జ్ జే వెంకటరమణ, చింతపల్లి యూనిట్ ఇంచార్జ్ కొర్ర మోహన్, అన్నవరం యూనిట్ ఇంచార్జ్ కిల్లో మోహన్, సురవరం ఇంచార్జ్ ఉల్లి సత్యనారాయణ, యూనిట్ ఇంచార్జ్ సుభద్ర, ముప్పల రంగారావు, ఐసిఆర్పీలు గదుతూరి బొజ్జిపడాల్, రెడ్డి విజయకుమార్, ఆనంద్, రైతులు పాల్గొన్నారు.

మంచి నీటి పరిరక్షణ-పంచ సూత్రాలు పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో- పాడేరు : గురువారం కలెక్టర్ చాంబర్‌లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో విశాఖ జిల్లా నవ నిర్మాణ సమితి ఆధ్వర్యంలో రూపొం దించిన మంచి నీటి పరి రక్షణ-పంచ సూత్రాలు, జల్ జీవన్ మిషన్ వర్కింగ్ ప్రాసెస్, విడబ్ల్యుఎస్‌సి విధులు భాధ్య తలు, సుజల సూక్తులు, వాష్ కార్యక్రమాలు మొదలగు ఐదు రకాల పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పట్ల అవగాహన కలిగి ఉండాలని తద్వారా ఆరోగ్యకర సమాజానికి దోహద పడడాలని సూచించారు. అదేవిధంగా నీటిని వృధా చేయరాదని, ప్రతి నీటి బొట్టును పొదుపు చేయాలని సూచించారు.

పి4 పోస్టర్ ఆవిష్కరణ : విద్యార్థులతో యోగ సాధన కార్యక్రమంపై జరిగిన సమావేశం అనంతరం రాష్ట్ర ప్రణాళిక శాఖ రూపొందించిన పి4 పోస్టర్ (పబ్లిక్, ప్రైవేటు, పీపుల్స్ పార్టిసిపేషన్) ను జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పేదరికం లేని సమాజ నిర్మాణానికి పి 4 సర్వే ఎంతో ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్కరూ ఈ సర్వే కు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ డా. ఎంజే అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్స్ ప్రీమియర్ లీగ్ లో అమెజాన్ డాట్ ఇన్ రాయితీలు

విశాలాంధ్ర - విశాఖపట్నం : ప్రముఖ ఈ కామర్స్ వేదిక అమెజాన్ డాట్ ఇన్ తన మొట్టమొదటి ఎలక్ట్రానిక్స్ ప్రీమియర్ లీగ్‌ను ప్రకటించటానికి సంసిద్ధంగా ఉందని అమెజాన్ ఇండియా కంజ్యూమర్ ఎలక్ట్రానిక్స్ విభాగ డైరెక్టర్ జేబా ఖాన్, వెల్లడించారు. ఇందులో, అగ్రశ్రేణి బ్రాండ్లకు జచెందిన స్మార్ట్ఫోన్లు, భారీ ఉపకరణాలు, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, టెలివిజన్ల విస్తృత శ్రేణి పై సాటిలేని డీల్స్ మరియు ఆఫర్లు లభిస్తాయన్నారు. గాడ్జెట్ల పట్ల ఆసక్తి కలిగినవారు అత్యాధునిక స్మార్ట్ఫోన్లు మరియు శక్తివంతమైన ల్యాప్టాప్లు మొదలుకుని అత్యుత్తమమైన స్మార్ట్వాచ్లు, హెడ్ఫోన్లు, టెలివిజన్లు, ఇంకా మరెన్నింటినో ఎక్స్ప్లోర్ చేయగలుగుతారు. అంతే కాక, ఈ నెల కస్టమర్లు, నో కాస్ట్ ఈఎంఐ, తక్షణ బ్యాంక్ డిస్కౌంట్లు, ఎక్స్ఛేంజ్ బోనస్లు, ఇంకా మరెన్నో రకాల అందుబాటులో ఉన్న ఆప్షన్లతో తమ టెక్ గేమును అప్గ్రేడ్ చేసుకోగలుగుతారన్నారు.

నాటు సారా నిర్మూలనే నవోదయం 2.0 లక్ష్యం

జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు : నాటు సారా నిర్మూలనే నవోదయం 2.0 లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ స్పష్టం చేసారు. గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరం నుండి నాటు సారా నివారణపై రెవెన్యూ, అటవీశాఖ, పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ నాటు సారా తయారీ దారులపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని సూచించారు. నాటు సారా నివారణకు గ్రామస్తులు, ప్రజా ప్రతినిధుల సహకారం తీసుకోవాలని తెలియజేసారు. గ్రామ మండల స్థాయి, డివిజన్ స్థాయిలో ప్రత్యేకాధికారులను నియమిస్తా మన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో నాటు సారా నిర్మూలన చర్యలు చేపట్టాలన్నారు. సారా తయారీపై 14405 టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం అందించాలన్నారు. అనంతరం నవోదయం ప్రచార రథాన్ని ప్రారంభించారు. జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ మాట్లాడుతూ గంజాయి మాదిరిగానే నాటు సారా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పోలీసులు, ఎక్సైజ్ అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. సారా తయారీ చేసే కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని పేర్కొన్నారు. మహిళా సంఘాల సహకారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్య క్రమంలో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఎస్. సుజీత్ సింగ్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ వి.నాగ రాహుల్, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎల్. రజని తదితరులు పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న కారు ఇద్దరికి గాయాలు

విశాలాంధ్ర - దుంబ్రిగూడ : మండలం లోని అరకు-పాడేరు ప్రధాన రహదారి బురదగెడ్డలో బైకును కారు ఢీకొన్న సంఘటన. స్థానికులు తెలిపిన వివరాలు. కొర్రాయి పంచాయతీ జాకరవలస గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు అరకు నుంచి స్వగ్రామానికి తిరుగు ప్రయాణిస్తుండగా, పాడేరు నుంచి అరకువైపూ వస్తున్న కారు యిరదగెడ్డ మలుపులో బైకును బలంగా ఢీకొంది. బైకులో ప్రయా ణిస్తున్న ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. కారు బలంగా ఢీకొట్టడంతో బైకు నుజ్జునుజ్జయ్యింది.

శ్రీరామనవమి ఫ్లెక్సీ ఆవిష్కరణ



విశాలాంధ్ర - వి.ఆర్.పురం : రెండవ భద్రాద్రి గా పేరు గాంచిన అల్లూరి సీతా రామ రాజు జిల్లా మండలంలోని రెండవ భద్రాద్రిగా పేరుగాంచిన శ్రీ రామగిరి గ్రామంలో గల అతి పురాతన స్వయంభూ శ్రీ సుందర సీతారామచంద్ర స్వామి వారి దేవాలయం నందు జరుగు 2025 సంవత్సర శ్రీ రామ నవమి ఉత్సవాలు సందర్భంగా చింతూరు ఐటిడిఏ ప్రోజెక్టు ఆఫీసర్ అపూర్వ భరత్ ను కలిసి శ్రీ రామ నవమి సందర్భంగా చేయవలసిన ఏర్పాట్ల గురించి, ఆలయ కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,శ్రీ రామ గిరి గ్రామం పోలవరం ప్రాజెక్ట్ ముంపునకు గురై శ్రీ సుందర సీతా రామ చంద్ర స్వామి వారి దేవాలయం శ్రీ రామ గిరి కొండ పై ద్వీప దేవాలయం లాగ మిగులుతుందనీ ఈ ఆలయాన్ని ఒక ఐలాండ్ (ద్వీప) దేవాలయం తరహాలో అభివృద్ధి చేయమని ప్రాజెక్టు అధికారిని కోరడమైనది. దీనికి ఆయన సానుకూలం గా స్పందించి ఈ దేవాలయాన్ని ఐలాండ్ టెంపుల్ గా అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటాము అని పేర్కొనడం జరిగింది. శ్రీ రామ నవమికి విచ్చేయు భక్తుల సౌకర్యార్థం వివిధ శాఖలకు ఆదేశాలు ఇస్తామని పేర్కొన్నారు. తదుపరి ప్రోజెక్టు అధికారి శ్రీ రామ నవమి ఫ్లెక్సీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్ పురం మండల టీడీపీ ప్రెసిడెంట్ శ్రీ ఆచంట శ్రీనివాస్, ఆలయ అర్చకులు శ్రీ సౌమిత్రి పురు షోత్తమాచర్యులు , ఆలయ చైర్మన్ శ్రీ పెందుర్తి సుదర్శన్, శ్రీరామగిరి సర్పంచ్ శ్రీ పులి సంతోష్, వైస్ ప్రెసిడెంట్ శ్రీ జి లక్ష్మ ణ రావు , మాజీ జడ్పీటీసీ శ్రీ ముత్యాల రామారావు , ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సవలం రాజేంద్ర ప్రసాద్ జన సేనా మండల కార్యదర్శి బాగుల అంజన్ రావు సిపిఎం నాయకులూ పోడియం శ్రీరామమూర్తి రామవరం ఉప సర్పంచ్ ఆకొజు భాగ్యలక్ష్మి గ్రామస్తులు, విలీన మండలాల ఎండోమెంట్ అధికారి లక్ష్మీపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు పూర్వ ప్రాథమిక విద్యపై శిక్షణ

విశాలాంధ్ర - గంగవరం : అంగన్వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య, పౌష్టికాహారం అమలుపై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని అంగన్వాడీల సద్వినియోగం చేసుకోవాలని సిడిపిఓ సిహెచ్ లక్ష్మి అన్నారు. గురువారం స్థానిక ఐసిడిఎస్ సీడీపీ ఓ కార్యాలయంలో అంగన్వాడి వర్కర్స్ కు పోషణ్ బి పడాయి బి కార్యక్రమంలో భాగంగా మూడు రోజులపాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని సిడిపిఓ లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల్లో ప్రాథమిక విద్యా పౌష్టాహారం ప్రతిష్ట అమలకు కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. వీటిని గ్రామస్థాయిలో అంగ న్వాడి వర్కర్స్ విజయవంతంగా అమలు చేయాలని ఆమె సూచించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్లు సత్యవతి జయలక్ష్మి గంగవరం ఐసిడిఎస్ సెక్టార్ పరిధిలో గల అంగన్వాడి వర్కర్స్లు పాల్గొన్నారు.

పల్లె పండుగ పనులన్ని శత శాతం పూర్తికావాలి

ఐదు రోజుల్లోగా బిల్లులు అప్లోడ్ చేయాలి
జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

విశాలాంధ్ర - పార్వతీపురం : జిల్లాలో పల్లె పండుగ కింద చేపట్టిన పనులన్ని రానున్న ఐదు రోజుల్లోగా శత శాతం పూర్తికావాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పల్లె పండుగ పనులను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ముఖ్యంగా ఫార్మ్ పండ్స్, ప్రహరీ గోడలు, మినీ గోకులాలు, రహదారులపై ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు. కావున ఈ నెల 25వ తేదీ నాటికి ఎన్ని పనులు చేయగలిగితే అన్నీ పూర్తిచేయాలని తెలిపారు. పనులు వేగవంతం చేసే ప్రక్రియలో ఎటువంటి తప్పులు చేయరాదని, నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని తేల్చిచెప్పారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీరాజ్, ఐటిడిఎ, పిఐయు ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సం.రం ముగిసేందుకు ఇంకా పది రోజులు గడువు ఉన్నప్పటికీ బిల్లులు సమర్పించేందుకు ఐదు రోజులు మాత్రమే గడువు ఉందని, కావున ఈలోగా పనులన్ని పూర్తి కావాలన్నారు. పూర్తిచేసిన పనులకు సంబంధించిన బిల్లులను ఎప్పటికప్పుడు ఆన్ లైన్ నందు అప్లోడ్ చేయాలని సూచించారు. ఇంజినీరింగ్ అధికారుల అభీష్టం మేరకు లక్ష్యాలను నిర్దేశించామని, అయినప్పటికీ ఇప్పటివరకు 40 శాతం పనులు పూర్తిచేసారని తెలిపారు. మిగిలిన 60 శాతం పనులు పురోగతిలో ఉన్నందున ప్రతి రోజు ప్రగతిని కనబరచాలని, నిర్లక్ష్యం వహించిన ఇంజినీర్లకు షోకాజ్ నోటీసులు జారీచేస్తామని హెచ్చరించారు. ఫార్మ్ పండ్స్, ప్రహరీ గోడలు, మినీ గోకులాలు, రహదారులు జిల్లాలో ఆవశ్యకమని, కావున వీలైనంత త్వరగా వాటిని పూర్తిచేసి ఈ నెల 25వ తేదీ నాటికి అప్పటివరకు జరిగిన పనులకు బడ్జెట్ బుక్ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా ఫార్మ్ పండ్స్ పై ఎంపిడిఓలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు కె. రామచంద్రరావు, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి బి. చంద్రశేఖర్, సీతంపేట గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారి వి. రమాదేవి, పంచాయతీ రాజ్ సాంకేతిక సలహాదారుడు ఎంవిఆర్ కృష్ణాజీ, డిఈఈలు, ఎఈఈలు పాల్గొన్నారు.

జడ్పీ నిధులతో మోటారు బోరు

విశాలాంధ్ర - డుంబ్రిగూడ : కొర్రా పంచాయతీ గొందిగుడ తాగునీటి కష్టాలను తీర్చేందుకు జడ్పీటీసీ నిధులతో మోటారు బోరు ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఆ పంచాయతీ సర్పంచి అర్జున్ బోరు తవ్వించేందుకు కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. గొందిగుడలో నీటి వనరులు లేక గతంలో గ్రామస్థులు ఇబ్బంది పడేవారన్నారు. జడ్పీటీసీ నిధులతో తాగునీటి కష్టాలు తీరుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రవీణ్, వైకాపా మండల కార్యదర్శి బాలరాజు పాల్గొన్నారు.

కార్పొరేట్ మరియు ప్రైవేట్ విద్యాసంస్థల్లో అడ్మిషన్లు పేరుతో దందా

ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్

విశాలాంధ్ర - బెలగాం : జిల్లా వ్యాప్తంగా కొన్ని ప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా విద్యాసంస్థలు నడుపుతూ 10వ తరగతి పరీక్షలు అవ్వకముందే ముందస్తు అడ్మిషన్లు చేస్తు న్నారని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ మండిపడ్డారు. విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గరికి వెళ్లి పాంప్లెట్లు ఇచ్చి విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెట్టే ప్రయత్నంలో ఉన్నారన్నారు. కొన్ని ప్రైవేట్ మరియు కార్పొరేట్ స్కూల్లో ముందస్తు అడ్మిషన్లు చేస్తూ ఫస్ట్ టెర్మ్ ఫీజులు మరియు పుస్తకాలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారని, ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పాల్పడుతున్న విద్యాసంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. అనేకసార్లు పత్రికల్లో కథనాలు వచ్చినా జిల్లా విద్యాశాఖ అధికారులు నిమ్మక నీరెత్తినటువంటి వ్యవహరించడం దుర్మార్గమని అన్నారు. తక్షణమే జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎం. హరికృష్ణ పాల్గొన్నారు.

పిల్లల మానసిక అభివృద్ధికి అంగన్వాడీలు కృషి చేయాలి

విశాలాంధ్ర - జి.మాడుగుల : పుట్టిన శిశువు నుంచి మూడేళ్ల వయస్సునిండిన పిల్లలకు శారీరక, మానసిక అభివృద్ధికి అంగన్వాడీలు సంపూర్ణంగా కృషి చేయాలని సీడీపీవో సువర్ణమ్మ సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పోషణ బీ పడాయిబీ (పీబీపీబీ) అనగా నవచేతన, ఆదర్శ శీల కార్యక్రమంలో భాగంగా గురువారం మండల అంగన్వాడీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి 3సంవంత్సరాల నుంచి 6 సంవత్సరాల పిల్లలకు ప్రీస్కూల్ కార్యక్రమాలు చేర్పించే విధానాన్ని అవగాహన కల్పించారు. అలాగే గ్రోత్ మానిటరింగ్ తదితర విషయాలు సిబ్బందికి. తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు వి.సత్యవతి, వి.సుజాత, ఎస్.విజయలక్ష్మి, ఎస్.సత్యవతి, డి.పద్మావతి, ఎం.లక్ష్మి, ఎల్.మణికుమారి. ఏ.కొండమ్మ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

నాయకులు, కార్యకర్తలు పార్టీ బలపేతానికి కృషి చేయాలి

బీజేపీ నేత ట్రైకర్ డైరెక్టర్ క్రిష్ణరావు

విశాలాంధ్ర - జి.మాడుగుల : పార్టీ బలోపేతానికి నాయకులు కార్యకరలు కృషి చేయాలని బీజేపీ నేత. ట్రైకర్ డైరెక్టర్ కూడ క్రిష్ణరావు సూచించారు. మం డలంలోని ఆయన గురువారం సందర్శించి ఇక్కడి పార్టీ నాయకులతో సమావేశమ య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న స్థానిక ఎన్నికలకు ఇప్పటి నుంచే గ్రామ స్థాయిలో కమిటీలను తయారు చేసి అభ్యర్థుల ఎంపిక కస రత్తు చేయాలని ఆదేశించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు సాగిన సింహాచలం, వి.సుబ్బారావు, కె.పార్వతమ్మ, కె.లక్ష్మణ్, కె.మహేశ్, చిరంజీవి, పద్మ, ఝాన్సీ, లక్ష్మచారి, పరమేశ్వరరావు పాల్గొన్నారు.

78 లక్షలకు గోదావరి ఫెర్రీ వేలం పాట

విశాలాంధ్ర - కూనవరం : కూనవరం గోదావరి రేవు వేలం పాట స్థానిక గ్రామపంచాయతీ లో నిర్వహించగా కూనవరం, వెలేరుపాడు, విఆర్ పురం మండలాల నుంచి తొమ్మిది మంది పాల్గొనగా హెచ్చు పాటను వేలేరుపాడు కు చెందిన బీరబోయిన కోటేశ్వరరావు 78.60 లక్షలకు పాట పాడి దక్కించుకున్నాడు. రెండోవ పాటను సొంది ముత్తయ్య 78.50 లక్షలకు వరకు చేరుకుంది. ఈ బహిరంగ వేలం పాటలో కూనవరం,రుద్రంకోట సర్పంచ్ లు హేమంత్ కుమార్,లలిత కుమారి,ఎంపీటీసీ కొమ్మాని అనంత లక్ష్మి, వైస్ ఎంపీపీ బండారు సాంబశివ రావు, తహసీల్దార్ శ్రీనివాస్ రావు, ఎంపిడిఓ రామాంజనేయ ప్రసాద్, విఆర్పురం ఈఓ అర్డి శ్రీకాంత్ రెడ్డి, కూనవరం, రుద్రంకోట సెక్రెటరీలు సురేష్, దావీదు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కంఠం భూములు రక్షించండి

విశాలాంధ్ర - గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీపురం మండలంలోని గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్ పేట పంచాయితీలలో బదలాయింపు చట్టం 1/70 అమలులో ఉన్నప్పటికీ ఆ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ మరియు గ్రామ కంఠం భూములను కొంత మంది గిరిజనేతరులు అధికారుల నుండి ఎటువంటి అనుమతులు లేకుండా ఆక్రమించి శాశ్వత నిర్మాణాలు ఏర్పాటు చేస్తున్నారని అలాంటి వారిపై సమగ్ర దర్యాప్తు జరిపించి అక్రమంగా భవనాలును తొలగించాలని గుమ్మలక్ష్మీపురం తహశీల్దార్ వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఆయన సానుకూలంగా స్పందించి అలాంటి వారిపై తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు ఆరిక చంద్రశేఖర్ ఐ.రామకృష్ణ, లోవరాజు, సీతారాం, తిరుపతి రావు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర - మక్కువ : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మన్యం జిల్లా కలెక్టర్, ఏ శ్యాంప్రసాద్ సూచనలు మేరకు గురువారం నాడు వ్యాచారచన పోటీలు 8 మరియు 9వ తరగతి విద్యార్థులు, ఆంధ్రప్రదేశ్లో, పేదరిక నిర్మూలన, పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్ట్నర్షిప్ పిఫోర్) కార్యక్రమంలో పై మక్కువ మండలంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ఎంపీడీవో డిడి స్వరూప రాణి ఆధ్వర్యంలో 8వ మరియు 9వ తరగతి విద్యార్థులు వ్యాచారచన పోటీలో పాల్గొనగా అందులో 24 మంది విద్యార్థులు పాల్గొనగా, ప్రథమ స్థానం, యూపీ చందన 9వ తరగతి జడ్పీహెచ్ఎస్ స్కూల్, ద్వితీయ స్థానం బి.ఒబామా, ఈఎం ఆర్ ఎస్ అనుసభద్ర, తృతీయ స్థానం, ఎం సుజాత కేజీబీవీ కాశీపట్నం, విద్యార్థులు ఎంపికయ్యారని ఎంఈఓ,1, పెంట సత్యనారాయణ, తెలిపారు, ఈ కార్యక్రమంలో ఎంఈఓ 2, డి, శ్యాంసుందర్రావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, మజ్జి హేమలత, మరియు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

విశాలాంధ్ర - మక్కువ : మన్యం జిల్లా మక్కువ మండలంలో దేవాంగుల వీధిలో కొలువైన కొంగుబంగారం శ్రీశ్రీ కోటదుర్గమ్మ ఆలయంలో, ప్రథమ వారోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలో భక్తులు, అధిక సంఖ్యలో పాల్గొని వేకువజాము నుంచే పూజలు ప్రారంభించారు, అభిషేకాలు నిర్వహించారు, మక్కువ మండల వైయస్సర్సీపి అధ్యక్షులు, మావుడి రంగు నాయుడు పూజలో పాల్గొని అనంతరం మహా అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ కార్యక్రమంలో, టిడిపి సీనియర్ నాయకులు, మావుడి ప్రసాద్ నాయుడు పాల్గొన్నారు ఉత్సవ కమిటీ సభ్యులు, ఖాతా శ్రీరామ్మూర్తి, ఖాతా అప్పారావు, అలజంగి అప్పారావు, యువకులు పాల్గొని విజయవంతం చేశారు.

చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు



విశాలాంధ్ర - చింతూరు : చింతూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మొదటి వార్షికోత్సవం, తృతీయ సంవత్సరం విద్యార్థినీ,విద్యార్థులకు వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చింతూరు గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు ఆఫీసర్, సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, గౌరవ అతిథిగా చింతూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ షేక్.నాగుల్ మీరా విచ్చేశారు. తొలుత జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైనది. సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డాక్టర్.కె రత్న మాణిక్యం మాట్లాడుతూ కళాశాల ప్రారంభమైనప్పటి నుండి కళాశాలలో అందుబాటులో ఉన్న కోర్సులు, కళాశాల అభివృద్ధిని వివరించారు. కళాశాల అభివృద్ధికి అవసరమైన అదనపు స్థలం కొరకు కృషి చేస్తున్న చింతూరు ఐ.టి.డి.ఏ పి.ఓ, డీ.ఎఫ్.ఓ, ఎఫ్.ఆర్.ఓ, చింతూరు తహసిల్దార్ తదితరులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇటీవల ప్రధానమంత్రి ఉచ్చితార్ శిక్ష అభియాన్ నుండి మంజూరైన రూ. 5 కోట్లు సంబంధించిన వివరనాత్మక ప్రాజెక్టు నివేదికను సమర్పించి, పరిపాలన అనుమతుల కొరకు వేచి చూస్తున్నట్లు తెలియజేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ అపూర్వ భరత్ మాట్లాడుతూ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థినీ విద్యార్థులను అభినందించారు. కళాశాల అభివృద్ధికి కృషి చేయుటకు హామీ ఇచ్చారు 2021- 2024 బ్యాచ్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు, నగదు బహుమతులు అందజేశారు. గౌరవ అతిథిగా విచ్చేసిన జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ షేక్.నాగుల్ మీరా మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహించిన క్రీడలు, పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చాటిన వారికి ప్రశంసా పత్రాలు, బహుమతులను అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్య క్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. కళాశాల సాంస్కృతిక విభాగ కార్యకర్త జి.హారతి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో జి.వెంకట రావు, ఎం.శేఖర్ ఎస్.రమేష్ తదితర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు అవగాహన

విశాలాంధ్ర - బలిజిపేట : బలిజిపేట ప్రోజెక్ట్ అరసాడ సెక్టార్ మరియు పెదపెంకి సెక్టార్ లకు మూడు రోజులు ట్రెనింగ్ (పోషణ భీ పడాయి భీ) బాల్య విద్య యొక్క ప్రాముఖ్యత మరియు బోధన అభ్యసన సాధన సమగ్ర అభివృద్ధి కొరకు అంగన్వాడీ టీచర్స్ కి మూడు రోజులు ట్రెనింగ్ తేది. 20.03.2025 టూ 22.03.2025 వరకు బలిజిపేట వెలుగు ఆఫీస్ లో శిక్షణ ఇవ్వడం జరుగుతుంది ఇందులో బలిజిపేట ప్రాజెక్ట్ సిడిపిఓ గారు ఎస్ సులేఖ మరియు సూపర్వైజర్ బి పద్మావతి గారు మరియు సిబ్బంది హాజరైనారు.

నాటు సారా స్థావరాలపై మెరుపు దాడి

70 లీటర్ల సారా స్వాధీనం : ఎస్ఐ షరీఫ్

విశాలాంధ్ర - దేవీపట్నం : గురువారం మధ్యాహ్నం ఎస్. రామన్నపాలెం శివార్లలో స్టేషన్ సిబ్బందితో కలసి ఎస్సై ఎస్కె షరీఫ్ ఆకస్మికంగా నిర్వహించిన దాడుల్లో నాటుసారా కాస్తున్న ఒక వ్యక్తిని అదుపులో తీసుకోగా అతని వద్ద 70 లీటర్ల నాటు సారా స్వాధీన పర్చుకోగా సారా తయారీకి ఉపయోగించే పెద్ద గిన్నె ధ్వంసం చేయడం జరిగింది. వ్యక్తిని అరెస్ట్ చేసి ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచడం జరిగిందని ఎస్సై తెలిపారు.

ఆశీలు పాట నిర్వహిస్తాం

విశాలాంధ్ర - చింతపల్లి : మండలంలోని లోతు గెడ్డ జంక్షన్ వారపు సంతకు సంబందించి ఆశీలు పాట నిర్వహి స్తున్నాం... ఆసక్తి గల వారు పాటకు హాజరు కావాలని పెద బరడ సర్పంచ్ సమిడి గోపాల్ అన్నారు. ఆ పంచాయతీలో ప్రతీ మంగళవారం జరిగే వారపుసంత ఆశీలు పాటను ఈ నెల 22న పెద బరడ గ్రామ పంచాయతీలో ఉదయం 10 గంటలకు వేలంపాట నిర్వహించ బడును. ఆసక్తి గలవారు హాజరై సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ గోపాల్ కోరారు.

కలెక్టర్ను మర్యాద పూర్వకంగా కలిసిన డీఎంసిఎస్

విశాలాంధ్ర - పార్వతీపురం : పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్గా ఐ.రాజేశ్వరి నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం కలెక్టర్ ఛాంబరులో జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ను ఆమె మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చాన్ని అందజేశారు. ఇప్పటివరకు జిల్లా మేనేజర్ గా కొనసాగిన పి.శ్రీనివాసరావు స్థానంలో ఆమె పదోన్నతిపై నియమించబడ్డారు.

300 మందికి వైద్య సేవలు

విశాలాంధ్ర - రాజవొమ్మంగి : రాజవొమ్మంగి మండలం వాతంగి పంచాయితీ కొమరాపురం గ్రామంలో గురువారం వైజాగ్ మెడికవర్ హాస్పిటల్,విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పటల్ వారిచే మెగా ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ భీమిరెడ్డి సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో ప్రారంభించారు,ఈ కార్యక్రమానికి వైస్ ఎంపీపీ జుర్ర రాజేశ్వరి, జుర్ర జాను,జడ్డంగి సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, అమినాబాద్ సర్పంచ్ కించు వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ చేదులూరి రాజబాబు,చేదులూరి అంజిబాబు, పోసిన అప్పారావు పాల్గొన్నారు, కార్యక్రమంలో చివరగా నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షులు ఆధ్య రమేష్ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన డాక్టర్లకు వారి సేవలకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్, నియోజకవర్గ ఇన్చార్జ్ నాగులపల్లి ధనలక్ష్మి తరఫున అభినందనలు తెలిపారు,ఈ కార్యక్రమంలో 300 మందికి పైగా ప్రజలు ఆరోగ్య సేవలు పొందారు,ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన జి శేషగిరిరావు గారికి డాక్టర్లకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

క్షయ వ్యాధిపై తాజంగిలో అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - చింతపల్లి : క్షయ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తాజంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ భవాని, డాక్టర్ ఉదయ్ సందీప్లు అన్నారు. ఈనెల 24న ప్రపంచ టీబీ దినోత్సవాన్ని పురస్కరించుకొని జరుగుతున్న వారోత్స వాలలో భాగంగా మండలంలోని తాజంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో టీబీ సూపర్వైజర్ ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు భవాని, ఉదయ్ సందీప్ లు మాట్లాడుతూ క్షయ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. క్షయ వ్యాధి పట్ల భయపడ వలసిన అవసరం లేదని, ప్రస్తుతం అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఈ వైద్య పరీక్షలు ఉచితముగా చేయించు కోవచ్చన్నారు. రెండు వారాలకు మించి ఎడతెరిపి లేని దగ్గు ఉన్నట్లయితే కచ్చితంగా వైద్య పరీక్షలు చేయించు కోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయితే క్రమం తప్పకుండా మందులు వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఈ ఓ.స్వామి, హెల్త్ సూపర్వైజర్ లక్ష్మి, ఎస్టిఎల్ఎస్ గౌరీ, ల్యాబ్ టెక్నీషియన్ సంజీవ్, వైద్య సిబ్బంది దేవి నాయుడు పాల్గొన్నారు.

అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలలో ఎన్డీఏ కూటమి నాయకులకు సమాచారం ఇవ్వని అధికారులు

తెదేపా మండల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు

విశాలాంధ్ర - చింతపల్లి : ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఎన్డీఏ కూటమి నాయకులకు సమాచారం అందించకుండా అధికారులు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెదేపా మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు అన్నారు. స్థానిక గిరిజన ఉద్యోగ భవనంలో పార్టీ మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి జన్మన్ గృహాల లబ్దిదారులనుంచి సంబంధిత అధికారులు పది శాతం పర్సంటేజ్ వసూళ్లు చేస్తున్నట్లు, పర్సంటెజ్ ఇవ్వకుంటే తదుపరి బిల్లులు చెల్లించమని సంబంధిత అధికారులు లబ్దిదారులను ఇబ్బంది పెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చింద న్నారు. ఇటువంటి చర్యలను అధికారులు మానుకోవాలని లేకుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం గిరిజనులకు పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, అధికారులు ఎన్డీఏ కూటమి పార్టీల నాయకుల ద్వారా లబ్దిదారులకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించినప్పుడు విధిగా ఎన్డీఏ కూటమి పార్టీల నాయకులకు సమాచారమివ్వాలని, పాత పద్దతులు మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, సీనియర్ నాయకులు బేతాళుడు, గంగరాజు, మంగు, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆనంద్, పీసా కమిటీ ఉపాధ్యక్షుడు రామకృష్ణ, షేక్ ఖాసిం వల్లి, చెన్నకేశవ, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు..కానరాని చలివేంద్రాలు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : గత కొన్ని రోజులుగా భానుడి భగభగలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. వారం రోజులుగా పగటిపూట ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. పార్వతీపురం జిల్లా కేంద్రం కావడంతో వివిధ కార్యాలయం పనుల మీద, వ్యాపార పనుల మీద పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఎండ తీవ్రతకు గురవుతున్నారు.వీరు దాహార్తిని తీర్చుకునేందుకు పట్టణంలోని చలివేంద్రాలు లేకపోవడంతో రోడ్లపై అమ్మే పానీయాలపై ఆధారపడవలసి వస్తుంది. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్న దృశ్య చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించినప్పటికీ నేటికీ చలివేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం శోచనీయమని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఆదేశాలనుసారం పట్టణంలోని కలెక్టర్ కార్యాలయ, చర్చి వీధి, ఆర్టీసీ కాంప్లెక్స్ బంధం వారి వీధి, పాత బస్టాండ్ తదితర కూడళ్ళ వద్ద చలి వేంద్రాల ఏర్పాటు చేయాలని ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.

అంపావలిలో కాలువలో పూడిక తీయించాలి : సీపీఎం

విశాలాంధ్ర - బలిజిపేట : ఈ సందర్భంగా బలిజిపేట మండలం అంపవల్లి గ్రామం లో సిపిఎం పార్టీ జిల్లా నాయకులు రెడ్డి వేణు. శాఖ కార్యదర్శి ఆవు సాంబమూర్తి మండల నాయ కులు యమ్మల మన్మధరావు పార్టీ సభ్యులు గ్రామాలలో ప్రజల దగ్గర వివిధ సమస్యలు అడిగి తెలుసు ఉన్నారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామంలో కాలువల్లో పేరుకుపోయిన చెత్త తీయకపోవడం వల్ల దోమలు దాడి చేసి ప్రమాదం మలేరియా డెంగ్యూ లాంటి విష జ్వరాలు పడే ప్రమాదం ఉందని బ్లీచింగ్ చల్లక కాలువలు శుభ్రం లేక దుర్గంధం వెదజల్లుతుంది కావున అధికారులు స్పందించి కాలువాల్లో పూడుకు తీయించాలని అన్నారు అలాగే కూటమి ప్రభుత్వం అధికారులకు వచ్చి తొమ్మిది నెలలు అయిన సందర్భంగా ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉన్నది సూపర్ సిక్స్ అమలు చేయలేదని చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు అమలు కాలేదని రైతులకు రైతు భరోసా పిల్లలకు అమ్మఒడి ఉద్యోగులకు డీఎస్సీ లాంటి సమస్యలు పరిష్కారం కాలేదు ఉచిత బస్సు సౌకర్యం లేదు ఉచిత గ్యాస్ డబ్బులు సక్రంగా పడలేదు 18 సంవత్సరాల నుండి ఆడపడుచులకు ఇస్తామన్న నెల 1500 వుసే లేదు కావున ప్రభుత్వం స్పందించి ప్రజల సమస్యలు పరిష్కారం చేయాలి కాలువలో కూడిక తీయించాలని కోరారు కార్యక్రమంలో గౌర్నాయుడు, విశ్వేశ్వరరావు, శివరాం, గణపతి, సత్యం, సన్యాసి నాయుడు, తదితరులు పాల్గొన్నారు,

కికెట్ స్టేడియంలో వైయస్సార్ పేరు తొలగించడం అన్యాయం

అరకు మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి

విశాలాంధ్ర - కొయ్యూరు : విశాఖపట్నం అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి పేరును తొలగించడం సమంజసం కాదని అరకు పార్లమెంటు మాజీ సభ్యురాలు శ్రీమతి గొట్టేటి మాధవి పేర్కొన్నారు. గురువారం వైయస్సార్ పార్టీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో గొడ్డేటి మాధవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి కాంస్య విగ్రహానికి సహసర ప్రజా ప్రతినిధులతో కలసి పాలాభిషేకం నిర్వహించారు. ముందుగా అరకు మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి మాట్లాడుతూ పేద ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిన మహానీయులు డాక్టర్ వైయస్ఆర్ అని ఆయన పేరును తొలగించడం సమంజసం కాదని ఆమె అన్నారు. అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఆయన పేరు చిరస్థాయిగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని ఆమె ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు ఎమ్మెల్యే రేగం మత్యలింగం, ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర పాడేరు మాజీ ఎమ్మెల్యే శ్రీమతి కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, శృంగవరపుకోట మాజీ ఎమ్మెల్యే శ్రీమతి శోభ హైమావతి, రాష్ట్ర మాజీ జిసిసి చైర్మన్ శ్రీమతిశోభ స్వాతిరాణి, అరకు వ్యాలీ మండలం జడ్పిటిసి శ్రీమతి శెట్టి రోషిని ఉమ్మడి విశాఖపట్నం జిల్లా వైసీపీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన

విశాలాంధ్ర - బలిజిపేట : మండలం ప్రకృతి వ్యవసాయ శాఖ మండల ఇన్చార్జ్ లక్ష్మీ ఆధ్వర్యంలో మిర్తి వలస, సుభద్ర, వెంగళరాయపురం, గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ప్రధాన పాత్ర పోషిస్తున్న ఘనజీవామృతము డెమోలను చేసి రైతులు మరియు మహిళా సంఘాలకు వివరించారు. 200కేజీల ఘనజీ వామృతము తయారీకి 200 కేజీల తాజా ఆవు పేడ, నాలుగు కేజీల బెల్లము మరియు నాలుగు కేజీల పప్పుల పిండి, 20 లీటర్ల గోమూత్రం, రెండు పిడికెళ్ల పుట్టమన్ను ఉపయోగించారు. బెల్లము పప్పుల పిండి మరియు పుట్టమన్నును తగినంత మూత్రంలో పూర్తిగా కరిగే అంతవరకు విడివిడిగా కలుపుకొని ఈ మూడు మిశ్రమాలను 200 కేజీల ఆవు పేడలో బాగా కలిసేంతవరకు ఉండలు లేకుండా మెత్తగా అయ్యేంతవరకు కలుపుకొని ఆ పేడను ఉండలుగా చుట్టుకొని నీడలో ఒక పట్టా మీద లేదా టార్పాలిన్ మీద వారం రోజులు ఎండ పెట్టుకోవాలని, తరువాత ఘనజీవామృతం తయారవుతుందని, అలా తయారైన ఘనజీవామృతాన్ని విత్తనాలతో పాటు ఎకరాకు 400 కేజీల చొప్పున కలుపుకొని వేయటం వలన, విత్తనాలకు కావలసిన తేమ శాతం లభించి పూర్తి విత్తన మొలక శాతంతో పాటు, మొక్కలకు కావలసిన రోగ నిరోధక శక్తి లభించడం మరియు మొక్కలకు కావలసిన అన్ని రకాల కనిజలవణాలను అందించే సూక్ష్మజీవులను ఉత్తేజ పరుస్తుందని కావున ప్రకృతి వ్యవసాయ రైతులతో పాటు అందరూ రైతులు ఈ ఘనజీవామృతాన్ని తయారుచేసుకొని రసాయనక ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవడంతో పాటు ఆరోగ్యమైన అధిక దిగుబడులు పొందుతారని మనవి చేశారు.

పి ఫోర్ సర్వేపై గ్రామసభలు నిర్వహించాలి

విశాలాంధ్ర - జీకే విధి : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పి ఫోర్ సర్వే పై గూడెం కొత్తవీధి మండలంలో పరిధిలో గల 16 పంచాయతీలు పి ఫోర్ సర్వేపై 21 న గ్రామసభలు నిర్వహించాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు గురువారం సమీక్ష సమావేశంలో అన్ని పంచాయతీ సెక్రెటరీ లను ఆదేశించారు. అన్ని గ్రామ పంచాయతీల్లో అందరికీ తెలిసేలా ప్రసారం రాతపూర్వక నోటీసులు అందజేయాలన్నారు. సర్వే వివరాలను సిస్టంలో డౌన్లోడ్ చేసుకుని గ్రామ పంచాయతీలో ప్రదర్శించాలన్నారు అభ్యంతరం ఉంటే పరిష్కరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి పాపారావు, పంచాయతీ సెక్రెటరీలు అరుణ కుమార్, బాలకృష్ణ, రాజ్యలక్ష్మి, పంచాయతీ సెక్రెటరీ లు తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయమున్నా వసతులు సున్నా.. ముఖ్య అధికారులే లేరు

విశాలాంధ్ర - జియ్యమ్మ వలస : ప్రస్తుత తరుణంలో ప్రజలకు అత్యంత కీలకమైన శాఖ రెవెన్యూ శాఖ ఈ శాఖలో సేవలు సక్రమంగా అందాలి అంటే ఆ శాఖలో ఉద్యోగులే అత్యంత కీలకం. అయితే కీలకమైన ఉద్యోగులు లేకపోతే అటు రైతులకు ఇటు ప్రజలకు అటు విద్యార్థులకు సేవలు అందుతాయా అనేది ఉన్నతాధికారులకు తెలియాల్సిన పరిస్థితి. అంతేకాకుండా తహసీల్దార్ కార్యాలయంలో మరిన్ని సమస్యలు తిష్ట వేసి ఉన్నాయి. ఈ సమస్యలపై ఉన్నతాధికారులు సరైన నిర్ణయాలు తీసుకొని సమస్యలు లేకుండా చూడాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో 25 రెవెన్యూ క్లస్టర్లు వాటి పరిధిలో 58 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ప్రస్తుతం సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దారు లేరు. గత సంవత్సర కాలం నుండి ఈ పోస్టు ఖాళీగానే ఉంది. రేషన్ దుకాణాల డీలర్లు ఎండియు ఆపరేటర్లు రేషన్ పంపిణీ విషయంలో ఎవరైనా ఫిర్యాదు చేయాలన్నా తహసీల్దారుకే చేయాల్సిన దుస్థితి. అంతేకాకుండా తహసీల్దారు కూడా లేరు. అయితే ప్రస్తుతం ఫుల్ ఎడిషనల్ చార్జెస్ క్రింద రెడ్డి పకీరు తహసీల్దారుగా కొనసాగుతున్నారు. అలాగే రీ సర్వే డిప్యూటీ తహసీల్దారుగా ఉన్న శివ జగన్మోహన్రావును కలెక్టరేట్ కు పంపించేసారు.

ప్రస్తుతం ఆ పోస్ట్ కూడా కాళీ గానే ఉంది. ప్రస్తుతం గ్రామాలలో రీ సర్వే జరుగుతున్న నేపథ్యంలో పర్యవేక్షణ చేసే అవసరం ఎంతైనా ఉంది. కానీ పర్యవేక్షణ కూడా తహసిల్దారే చేయాల్సిన దుస్థితి. ఇదిలా ఉంటే ఈ తహసీల్దార్ కార్యాలయంలో మరిన్ని సమస్యలు తిష్ట వేసి ఉన్నాయి. కార్యాలయ నూతన భవనాన్ని లక్షల రూపాయల వ్యయంతో నిర్మించినప్పటికీ టాయిలెట్లకు రన్నింగ్ వాటర్ పూర్తిగా లేదు. ఈ భవనాన్ని నిర్మించిన గుత్తేదారు నిర్లక్ష్యం కారణంగా కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందికి అవసరమైతే ఈ టాయిలెట్లు పనికి రాకుండా పోయాయి. అతి అవసరమైతే బహిరంగ మూత్ర విసర్జన చేయకూడదని చెప్పిన వారే ఆ పొరపాటు చేయాల్సిన పరిస్థితి. రన్నింగ్ వాటర్ సదుపాయాన్ని ఈ కార్యాలయానికి ఏర్పాటు చేయాలని ఈ కార్యాలయంలోని ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అంతేకాకుండా కార్యాలయం చుట్టూ ప్రహరీ గోడ లేక కార్యాలయ ప్రాంగణమంతా బహిర్భూమిగా మారిపోయిందని చూపరులు ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీని కారణంగా దుర్వాసనతో ఉద్యోగులు అర్జీదారులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదిలా ఉంటే పక్కనే ఉన్న ఎంపీడీవో కార్యాలయ భవనాలు శిథిలావస్థకు చేరుకుంటే దానికి ప్రహరీ గోడ నిర్మిస్తున్నారు. అంతేకాకుండా వెటర్నరీ హాస్పిటల్, రైతు భరోసా కేంద్రం ఎంఆర్సి పంచాయతీ భవనాలన్నింటికీ ఒకటే ప్రహరీ గోడ నిర్మించి ప్రభుత్వ కార్యాలయాల సముదాయంగా మార్చిన అధికారులు కేవలం మండల తహసీల్దార్ కార్యాలయానికి ప్రహరీ గోడ విషయంలో పట్టించుకోలేదని పలువురు బాహాటంగానే చర్చించుకుంటున్నారు. మండల తహసీల్దార్ కార్యాలయం అంటే మండల మెజిస్ట్రేట్ కార్యాలయం అని అర్థం. అయిన ప్పటికీ ఈ కార్యాలయంపై ఇంత నిర్లక్ష్యమా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ తహసిల్దార్ కార్యాలయం విషయంలో జిల్లా కలెక్టర్ స్పందించి సమస్యలు లేని మండల తహసీల్దార్ కార్యాలయంగా ఉండే విధంగా చొరవ చూపాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

విశాలాంధ్ర - దుంబ్రిగుడ : అగ్ని ప్రమాదాలు నివారణపై గురువారం కిల్లోగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్య సిబ్బందికి, విద్యార్థులకి అగ్ని ప్రమాదాలు - నివారణ చర్యలు, తీసుకో వలసిన జాగ్రత్తలపై అగ్నిమాపక కేంద్రం అధికారి ఏవి రమణ (పాడేరు) అవగాహన కల్పించారు. ప్రమాద సమయాలలో డోలి పట్టడం, నీటి మునిగిన వారిని ఎలా కాపాడాలో, గ్యాస్ నుంచి మంటలు వ్యాపించినప్పుడు ఎలా నివారించాలో ప్రదర్శన ద్వారా ఫైర్ హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్ చూపించారు. ఈ కార్యక్రమంలో కిల్లోగూడ పిహెచ్సి డాక్టర్ నజీబుల్లా, కుమార్ రత్న, సుంకరమెట్ట పిహెచ్సి డా.ఉపేంద్ర, కిల్లోగూడ పిహెచ్సి వైద్య సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

108లో గిరి మహిళ ప్రసవం...

విశాలాంధ్ర - అనంతగిరి : గిరి మహిళ 108లో ప్రసవించిన ఘటన అనంతగిరి మండలం లోని లంగు పర్తి పంచాయతీ పరిధి లో జరిగింది. మెట్ట వలస గ్రామానికి చెందిన మజ్జి ప్రతిమ నిండు గర్భిణి, పురి టినొప్పులు వస్తుండడంతో కుటుంబ సభ్యులు 108 కు సమాచారం అందించారు.. అయితే మెట్ట వలస నుంచి లంగుపర్తి పీహెచ్సీకి ప్రతిమను తరలిస్తుండగా.. మార్గమధ్యలోని నొప్పులు అధికమవ్వడంతో ఈఎంటీ మౌనిక వైద్యసేవలను అందించడంతో 108 వాహనంలోనే ప్రసవించింది.. వెనువెంటనే తల్లీబిడ్డను లంగుపర్తి పీహెచ్సీకి తరలించి, మెరుగైన వైద్యసేవలను అందించారు. తల్లీబిడ్డ ఆరోగ్యవంతంగా ఉన్నారని. సిబ్బంది తెలిపారు.

ఎస్సీ వర్గీకరణకు క్యాబినెట్ తీర్మానం చేయడంపై ఎమ్ఆర్పిఎస్ హర్షం

విశాలాంధ్ర - దేవీపట్నం : ఎస్సీ వర్గీకరణ పై అధ్యయనానికి నియమించిన ఏక సభ్య కమిషన్ నివేదికను రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించడం హర్షణీయమని ఎమ్మెస్ పిఎస్ ఏఎస్ఆర్ జిల్లా అధ్యక్షులు పళ్ళపాటి నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. క్యాబినెట్ తీర్మానంలో మాల, మాదిగ మంత్రులు, ఎమ్మెల్యేలు ఏకాభిప్రాయం తో అంగీకరించడం శుభ పరిణామమన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 59 ఎస్సీ ఉపకులాలకు వారి జనాభా నిష్పత్తి ప్రకారం 15 శాతం రిజర్వేషన్ ను న్యాయబద్ధంగా కేటాయించడాన్ని స్వాగతిస్తు న్నామన్నారు. ఎస్సీ రెల్లి ఉప కులాల ప్రజలకు 1శాతం, గ్రూప్ మాదిగ, ఉప కులాలకు 6.5 శాతం, గ్రూప్ మాల, ఉపకులాలకు 7.5 శాతం గా పంచడం జరిగిందన్నారు. ఈ విధానం అంబేద్కర్ స్ఫూర్తి కి నిదర్శనం అని తెలిపారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ రాష్ట్రాన్ని యూనిట్ గా తీసుకొని విద్యా, ఉద్యోగ, సంక్షేమ రంగాల్లో అమలు చేయడం హర్షణీయమన్నారు. వర్గీకరణ అమలు అయ్యేంతవరకు అన్ని విభాగాల్లో ఉద్యోగ నియమకాలు నిలుపుదల చేయాలని సూచించారు. అలాగే వర్గీకరణ ప్రక్రియ పూర్తయ్యేంతవరకు ఉద్యోగులకు ప్రమోషన్ లో రిజర్వేషన్లు వెంటనే నిలువుదల చేయాలని కోరారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు తీర్మానం చేసి, జాతీయ ఎస్సీ కమిషన్ అనుమతికి పంపాలని విజ్ఞప్తి చేశారు. జాతీయ ఎస్సీ కమిషన్ రిపోర్ట్ వచ్చిన వెంటనే ఎస్సీ వర్గీకరణకు చట్ట బద్ధత కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్ళ నుండి సుదీర్ఘ పోరాటం చేసి మాదిగ, ఉపాకులాల ప్రజలను తీరాలకు చేర్చిన పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ జాతి తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేలబావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర - బెలగాం : నేల బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై సంతోషి కుమారి అందించిన వివరాలు ప్రకారం పార్వతీపురం మునిసిపాలిటీ సారికి వీధికి చెందిన మజ్జి సత్యనారాయణ (54) అనే వ్యక్తి పార్వతీపురం మండలం నర్సిపురం శివారు విజయ బ్యాంకు వెనుక ఉన్న నేల బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు మజ్జి సత్యనారాయణ భార్య పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండు రోజుల క్రితం డాక్టర్ వద్దకు వెళ్లి వస్తానని చెప్పిన తన భర్త ఎంతకు ఇంటికి రాకపోవడంతో పలుచోట్ల బంధుమిత్రులతో కలిసి గాలించామని గురువారం ఉదయం నేల బావిలో శవంగా కనిపించారని తెలిపారని, తన సోదరుడు సుంకరి నాగభూషణరావు ఇటీవల మృతి చెందారని, అప్పటినుండి తన భర్త తీవ్ర మనస్థాపానికి లోనయ్యారని, ఆ పరిస్థితుల్లోనే ఈ ఘటనకు పాల్పడినట్లు తాము భావిస్తున్నట్లు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి ఒక కొడుకు కూతురు ఉండగా కుమార్తెకు కొద్ది నెలల క్రితమే వివాహం జరిగినట్లు రూరల్ ఎస్ఐ సంతోషికుమారి తెలిపారు.

వేతనాలు పెంపు, ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

విశాలాంధ్ర - సీలేరు : సీలేరు పంచాయతీలో గల ఔట్ సోర్సింగ్ కార్మికుల వేతనాల పెంపు, ఉద్యో భద్రత మొదలగు సమస్యలు పరిష్కరించాలని సీలేరు సీఐటీయు బ్రాంచ్ ఆధ్వర్యంలో సీలేరు సర్పంచ్ దుర్గ్గాకు వినతిపత్రం అందజేశారు. సుమారు ఆరుగురు పారిశుద్య కార్మికులు ఔట్ సోర్సింగ్ విధానంలో గత 15 సంవత్సరాల నుండి పని చేస్తూ కనీసం ఇప్పటి వరకు మెరుగైన వేతనాలు, ఉద్యోగ భద్రత, వారంతపు సెలవులు, ఖచ్చితమైన పని దినాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ ఇన్సూరెన్స్ వంటి సదుపాయాలు పొందటం లేదన్నారు. చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. కావున తమ సమస్యల పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు సుభాన్, బ్రాంచ్ ప్రెసిడెంట్ బి.లక్ష్మణరావు, బ్రాంచ్ సెక్రటరీ టి.విష్ణుకుమార్, కన్వీనర్ ఎంవి.రమణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్ వనముల రాము పాల్గొన్నారు.

అసెంబ్లీకి వెళ్లి గిరిజన ప్రాంత సమస్యలపై గళం వినిపించండి

జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోతుర్తారు విష్ణుమూర్తి

విశాలాంధ్ర - జీకే విధి : అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, అరకు నియోజకవర్గానికి సంబంధించిన ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకుండా ఉండటం చాలా భాదకారమని జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పొత్తూరు విష్ణుమూర్తి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏజెన్సీ గిరిజన ప్రాంత ప్రజలు నమ్మకంతో ఓటు వేసి గెలిపిస్తే, గిరిజనుల యొక్క హక్కులు చట్టాలు సమస్యలకోసం అసెంబ్లీలో గళం విప్పకుండా ఇంట్లో కూర్చుని ఉండటం సరైనదికాదని మండిపడ్డారు. రెండు నియోజకవర్గాల్లో పేరుకే ఎమ్మెల్యేలుగా ఉన్నారు కానీ ఇప్పటి వరకు ఏ గ్రామ పంచాయితీలలో సందర్శించలేదన్నారు. ప్రజలు ఎన్నుకున్నది సమస్యలను పరిష్కరించాలని చట్టాలు కాపాడాలని కానీ వీరు ఈ సమస్య చట్టాలు కోసం అసెంబ్లీలో మీ గళం విప్పక పోవటం ప్రజల యొక్క సమస్యలకు న్యాయం చెయ్యలేక పోతున్నారన్నారు. సభలోకి హాజరుకాకుండా దొంగ సంతకాలను పెడుతున్నారని అసెంబ్లీలో స్పీకర్ అన్నారని గుర్తు చేశారు. ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో ఎన్నెన్నో సమస్యలు ఉన్నాయని వాటిపై అసెంబ్లీలో ప్రశ్నించకుండా అసెంబ్లీకి వెళ్లకుండా ప్రజలకు అన్యాయం చేసిన వారు అవుతారని ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని హితవు పలికారు.

మండల పరిషత్ రికార్డులు పరిశీలించిన జిల్లా సీఈవో

విశాలాంధ్ర - జీకే వీధి : విశాఖపట్నం జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి పి నారాయణమూర్తి గూడెం కొత్త వీధి మండలం లో పర్యటించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయమును సందర్శించి రికార్డులను తనిఖీ చేసి కార్యాలయం రికార్డులు నిర్వహణ మరింత మెరుగుపరుచుకోవాలని ఎంపీడీవో ఆఫీస్ సిబ్బందికి ఆయన సూచించారు. ఎస్ డబ్ల్యు పి సి షెడ్స్ ద్వారా వర్మీ కంపోస్ట్ ను డ్రై వేస్ట్ ను ప్రొడ్యూస్ చేయవలసిందిగా చెప్పారు. మండల ప్రజా పరిషత్ కు సంబంధించిన బిపిడిపి నిధులు మంజూరు చేయవలసిందిగా ఎంపీపీ బోయన కుమారి ముఖ్య నిర్వహణ అధికారితో మాట్లాడటం జరిగిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఈవోపీఆర్డి పాపారావు, పిఆర్జెఈ కె.జ్యోతి బాబు, ఆర్డబ్ల్యుజేఈ కళ్యాణ్, పంచాయతీ సెక్రెటరీ లు ఎంపీడీవో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మారెమ్మ అమ్మవారి వార్షిక మహోత్సవాల నిర్వహణపై సమావేశం

విశాలాంధ్ర - సీలేరు : జీకేవీధి మండలం సీలేరు మారెమ్మ అమ్మవారి 53వ వార్షిక మహోత్సవాల నిర్వహణపై గురువారం ఆలయ ప్రాంగణంలో ఆలయ నిర్వా హకులు కారే శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. సీలేరు కాంప్లెక్స్ ఏపీ జెన్కో సూపరింటెండెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్రెడ్డి ముఖ్య అతిధిగా హాజరై ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. ఏప్రిల్ 14న తమిళ సంవత్సరాధి రోజున అమ్మవారి జెండా ఆవిష్కరణతో అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 15న అమ్మవారి గరగ అలంకరణ, అగ్నిగుండం కార్యక్రమం, 25న సామూహిక కుంకుమార్చన, 26న అమ్మవారి తిరువీధి ఉత్సవం, 27న అమ్మవారి ప్రధాన పండుగ కార్యక్రమం, 28న చల్లనీటి ఉత్సవం, 30న అమ్మవారి మరుపూజ కార్యక్రమం నిర్వహించడానికి ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షునిగా జెన్కో ఎస్ఈ చంద్రశేఖర్రెడ్డిని, గౌరవ ఉపాధ్యక్షులుటగా ఏడీఇ టి.అప్పలనాయుడును నియమించారు.

గంజాయితో అక్రమ ఆస్తుల సంపదని జప్తు చేస్తాం : రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి

విశాలాంధ్ర - బెలగాం : విశాఖపట్నం రేంజ్ పరిధిలో గడిచిన 8 నెల్లలో గంజాయి నిర్మూలనకు సమూల మార్పులు తీసుకువచ్చామని, గంజాయితో అక్రమ ఆస్తుల సంపాదన జప్తు చేస్తామని విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు బానిసై అమూల్యమైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని కోరారు. 226 గంజాయి కేసులలో 7,378 కేజీల గంజాయిని డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో రేంజ్ డిఐజి నిర్వీర్యం చేశారు. ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హరీష్ కుమార్ గుప్త ఆదేశాల మేరకు, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల పోలీసులు వివిధ కేసులలో స్వాదీనం చేసుకున్న గంజాయిని గురువారం శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం పాత కుంకాము గ్రామం పరిధిలో ఉన్న రైన్ బో ఇండస్ట్రీ వద్ద డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో రేంజ్ డిఐజి గోపినాథ్ జట్టి, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల ఎస్పీలు కెవి మహేశ్వర్ రెడ్డి, వకల్ జిందాల్, ఎస్.వి మాధవ్ రెడ్డి గంజాయి ధ్వంస నిర్వీర్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాకు సంబందించిన వివిధ పోలీస్ స్టేషన్లలో (పార్వతీపురం, కొమరాడ, సాలూరు, పాచిపెంట, బత్తిలి) 48కేసులలో పట్టుబడిన గంజాయిని గురువారం లావేరు పోలీస్ స్టేషన్ పరిధి పాత కుంకాము గ్రామం పరిధిలో ఉన్న రైన్ బో ఇండస్ట్రీ నందు విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జెట్టి ఆధ్వర్యంలో పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి మాధవరెడ్డి, డ్రగ్ డిస్పోజల్ కమిటీ సమక్షంలో 48 కేసులలో పట్టుబడిన సుమారు 875.189 కేజీల గంజాయి నిర్వీర్యం చేయడం జరిగింది. ఈ నిర్వీర్యం కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లాకు సంబందించి పార్వతీపురం ఎఎస్పీ అంకిత సురాన, పాలకొండ డిఎస్పీ రాంబాబు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో గిరిజనులను బతకనివ్వరా..?

విశాలాంధ్ర - బెలగాం : కూటమి పాలనలో గిరిజనులను బతకనివ్వరా అని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసారు. గిరిజనులకు "పోడు" పట్టాలు ఇచ్చిన పార్వతీపురం మండలంలో "బడి దేవరమ్మ" కొండ తవ్వకాలు చేసి భవిష్యత్తులో గిరిజనులకు బతుకు లేకుండా చేస్తున్నదని అలాగే సీతానగరం మండలం అప్పయ్యపేట గిరిజనులకు "పోడు" పట్టాలు ఇచ్చిన చోట "ఎలిఫెంట్ జోన్" పేరిట తవ్వకాలుచేసి బతుకులు లేకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. మరో వైపు 1/70 చట్టం లేకుండా చేయటానికి కుట్రలు చేస్తూ గిరిజనులకు బతుకులు లేకుండా చేస్తున్న కూటమి పాలన తీరు మార్చుకోవాలని రంజిత్ కుమార్ డిమాండ్ చేసారు. ఇటువంటి గిరిజన వ్యతిరేక విధానాలపై ధర్మపోరాటం న్యాయ పోరాటం తప్పదని స్పష్టం చేసారు.